క్లుప్తంగా

షరీఫ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే బుర్రా



షరీఫ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు ఎస్‌కే చెరువుకట్ట షరీఫ్ కుమారుడు ఎస్‌కే ముష్కార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి విదితమే. ఈమేరకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం షరీఫ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. షరీఫ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ పట్టణ కన్వీనర్ సానికొమ్ము రంగనాయకులరెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు యాదవ్, కౌన్సిలర్లు కృష్ణా, జానీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు

వెలిగండ్ల: వెలిగండ్ల మండల కేంద్రంలో బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీఆర్వో బెంజిమెన్ మాట్లాడుతూ డ్రోన్ సర్వే ద్వారా వెలిగండ్లలోని సర్వే నంబర్ల వారీగా వాటి విస్తీర్ణం నిర్ధారిస్తామన్నారు. భూములు సర్వే చేసే సమయంలో భూ యజమానులకు తెలియజేస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ శివ, రైతులు ఆదిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు టంగుటూరు విద్యార్థి



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టంగుటూరు: జె.పంగులూరు మండలం బూదవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కె మహ్మద్ రఫీ సత్తా చాటి జిల్లా జట్టులో స్థానం సంపాదించాడని హెచ్‌ఎం తులసి ప్రభ తెలిపారు. అలాగే జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో గుంటూరి కీర్తన , అరిగెల చిన్నారి ప్రతిభ చాటారని చెప్పారు. ముగ్గురు విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పీడీ అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పేదలకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న సుధీర్

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు రాజాల ఆదిరెడ్డి తండ్రి రాజాల పేరారెడ్డి వర్ధంతి సందర్భంగా స్నేహహస్తం ఆధ్వర్యంలో స్థానిక కాశిరెడ్డి కాలనీలోని పేదలకు బుధవారం బియ్యం, నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్నేహ హస్తం ట్రస్టు చైర్మన్ డి.సుధీర్ మాట్లాడుతూ తండ్రి ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ నాయకుడు రాజాల ఆదిరెడ్డి అనేక సేవాహిత కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. సంస్థ ప్రతినిధులు, ఖాశింపీరా, శ్రీను పాల్గొన్నారు..

స్వచ్ఛతపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజలు

పీసీపల్లి: స్వచ్ఛత సంకల్పంపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని గుడిపాటిపల్లి సర్పంచ్ కటికల రిబ్కా అన్నారు. మండలంలోని గుడిపాటిపల్లిలో స్వచ్ఛతా సేవపై గ్రామ సభ, ప్రజలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం, పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కటికల రిబ్కా మాట్లాడుతూ ప్రజలందరికీ స్వచ్ఛతపై అవగాహన కల్పించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మించడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. నాయకులు కటికల వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి షేక్ షకీల, డిజిటల్ అసిస్టెంట్ షేక్ రేష్మ, వెటర్నరీ అసిస్టెంట్ ఆంజనేయులు, వలంటీర్లు, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

గణపతి బొప్పా మోరియా..!

● కోలాహలంగా వినాయక నిమజ్జనోత్సవాలు



జంగాలపల్లెలో వినాయకపూజల్లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు



పొందూరులో విఘ్నేశ్వరుడి పూజలో వరికూటి, నాయకులు



వినాయక రథాన్ని నడుపుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



పాకల బీచ్‌లో గణేశుడి ప్రతిమల నిమజ్జనం

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో కొలువైన వరసిద్ధి వినాయకున్ని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం దర్శించుకుని విశిష్ట పూజలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే అన్ని వార్డుల్లోని వినాయకుని విగ్రహాలకు పూజలు చేశారు. విగ్రహాల కమిటీ నాయకులు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను, ఎంపీపీ దంతులూరి ప్రకాశంను ఘనంగా సన్మానించారు. పాతూరులో జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా పాల్గొని ప్రజలను ఉత్సాహ పరిచారు. కౌన్సిలర్ దాసరి మురళీ, కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనులు ఎమ్మెల్యేకు ప్రత్యేక మెమోంటో అందచేసి సన్మానించారు. కొట్లబజారులో వినాయక ఊరేగింపు రథాన్ని ఎమ్మెల్యే నడిపారు. అద్దంకి రంగబాబు వారి వీధిలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, ఆర్ మాణిక్య రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, ఏపీ ఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణంలో పలు చోట్ల వినాయక విగ్రహాలకు రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెర్వు సత్యన్నారాయణరెడ్డి బుధవారం పూజలు చేశారు. విగ్రహ కమిటీ నాయకులు ఆయన్ను సన్మానించారు. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. పార్టీ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్‌రెడ్డి, ఎం రమణారెడ్డి, ఫణీంద్ర పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టించిన పలు విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. కనిగిరి పట్టణం, మండలంలో అధికారికంగా సుమారు 130 విగ్రహాలకు అనుమతి తీసుకోగా, వీటిలో సుమారు పట్టణంలో 27, రూరల్ గ్రామాల్లో 36 విగ్రహాలను నిమజ్జనం చేశారు. దీంతో పట్టణంతో పాటు, ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. జై గణేష్, జై..జై గణేష్.. గణపతి బొబ్బ మోరియా నినాదాలతో పట్టణ ప్రాంతాల్లో హోరెత్తాయి. తప్పెట్ల తాళాలతో అంగరంగ వైభవంగా వినాయక నిమజ్జనోత్సవ ఊరేగింపు సాగాయి. మండలంలోని ఎన్ గొల్లపల్లి చెరువుకు, పునుగోడు చెరువుకు, పాకాలకు కొన్ని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. కనిగిరి డీఎస్పీ రత్నాకర రామారాజు పర్యవేక్షణలో సీఐ శివ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై దాసరి ప్రసాద్ పోలీసు బందో బస్తు నిర్వహించారు. ఎస్ గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద డీఎస్పీ స్వీయ పర్యవేక్షణ చేశారు.

పామూరు: మండలంలోని అన్ని వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్ష్మీనరసాపురంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు పలువురు వినాయక ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ మన్నేపల్లి విజయశేఖర్, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, గట్లా విజయభాస్కర్ రెడ్డి, జె.గోవిందయ్య, మూల కోటిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): మండలంలో వినాయక చవితి ఉత్సవాలు గత 3 రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. కాగా మండలంలోని జంగంవారిపల్లెలో బుధవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా విగ్రహ ఏర్పాటుకమిటీ, స్థానిక నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సర్పంచ్ అంబటి ప్రవీణ్‌కుమార్, చోడా రవిచంద్ర, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, గడ్డం రంగారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలో వినాయక నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. హనుమంతునిపాడు, వేములపాడు, రాజుగారిపల్లి, గాయంవారిపల్లి, సీతారాపురం, కూటాగుండ్ల, హాజీపురం, తిమ్మారెడ్డిపల్లి, దాసరిపల్లి మొరవారిపల్లి తదితర గ్రామాల్లో గణేష్‌ని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. విగ్రహాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవాలు నిర్వహించుకుంటూ నిమజ్జనానికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీసీపల్లి: మండలంలో వినాయక నిమజ్జనాలు బుధవారం కోలాహలంగా సాగాయి. పీసీపల్లి, జంగాలపల్లి, పెదయిర్లపాడు గ్రామాల్లో గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాలు, ఉట్టికొట్టు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యువకుల కేరింతలు, బాణాసంచాల మధ్య గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించి దగ్గరలోని చెరువుల్లో నిమజ్జనం నిర్వహించారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

పొందూరులో వరికూటి పూజలు

టంగుటూరు: టంగుటూరు మండలంలోని పొందూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, నాయకులు ఏలూరి వంశీ, సుబ్బారాయుడు, చక్రపాణి, తదితరులు ఉన్నారు.

మర్రిపూడి: కొండపి మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులుగా పూజలందుకున్న గణేశుడు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లాడు. ముందుగా ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే మర్రిపూడిలో వినాయకుడికి బుధవారం అర్చకుడు గంద్రకోట శ్రీనివాస శర్మ, కొత్తా లక్ష్మీన్నారాయణ ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. యువతీయువకులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. లడ్డు, కలశం, రవికకు బహిరంగ వేలం నిర్వహించారు. రాములవారి ఆలయం వద్ద వైఎస్సార్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సుమారు 600 మందికి అన్నదానం చేశారు.

పాకల బీచ్‌లో నిమజ్జన సందడి

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో గణేశ్ నిమజ్జనాల సందడి నెలకొంది. బుధవారం మండలంలోని గ్రామాల నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి విగ్రహాలు పెద్ద ఎత్తున తరలివచ్చాయి. సముద్ర స్నానానికి వచ్చే భక్తుల రక్షణార్థం పోలీసులు తీరం వెంబడి చర్యలు చేపట్టారు. సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై టి.శ్రీరామ్, మెరైన్ పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.



రాజుగారిపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణేష్ విగ్రహం



పీసీపల్లిలో గణనాథున్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న యువకులు



నిమజ్జనోత్సవానికి తరలుతున్న గణపయ్యలు



ఎన్ గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పర్యవేక్షణ చేస్తున్న డీఎస్పీ రామరాజు

అంగన్‌వాడీలు సంరక్షణా నిలయాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది

పామూరు: అంగన్‌వాడీ కేంద్రాలు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల సంరక్షణ నిలయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని మార్కొండాపురంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ పౌష్టికాహార ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు అవగాహన కలిగి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం ఇతర పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా అధిక పౌష్టికాహారం ఉన్న ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. ఈ సంద్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే షేక్.మొమిన్, వైద్యసిబ్బంది నదియా, ఎం ఇంద్రజ, బి.సౌందర్య, కె.కళావతి, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

హనుమంతునిపాడు: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీపీ గాయం సావిత్రి అధికారులను హెచ్చరించారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాలర్పించారు. అనంతరం సమావేశంలో ఒక్కో శాఖాధికారులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజాప్రతినిధులు కోరారు. గాలి వానకు విరిగిన పడిన స్తంభాలను ఇంత వరకు మార్పు చేయలేదన్నారు. వెంటనే సర్పంచులు అడిగిన గ్రామాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు స్పందించి పనిచేయాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. తాగునీరు సక్రమంగా సర్పరా కావడం లేదని గాయంవారిపల్లి సర్పంచ్ రామక్రిష్టారెడ్డి, నారాయపల్లి సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎంపాడు ఎంపీటీసీ వెంకటసుబ్బారెడ్డి, హనుమంతాపురం ఎంపీటీసీ తానిగుండాల తిరపతరెడ్డిలు ఎంపీపీ ద ష్టికి తీసకెళ్లారు. గ్రామాల్లో సాగర్ జలాలు సక్రమంగా అందేట్లు చూడాలని ఎంపీపీ గాయం సావిత్రి ఆర్‌డబ్ల్యూఎఈ శ్రీకాంతకు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు గ్రామాల్లో విజయ వంతం చేయాలన్నారు. అధికారులు, నాయకులు అవేకమై జగనన్న, ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజల అందించే వైద్య సేవలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ కె.లలిత, వైస్ ఎంపీపీ కొదమల బెంజిమేన్, వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, ఎంపీటీసీలు, సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఎస్ మధుసూదన్‌రెడ్డి, గాయంవారిపల్లి సర్పంచ్ రామక్రిష్టారెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీటీసీ నారాయణస్వామి, జి,దేవమ్మ, ఏఈ చెన్నకేశవులు, ఏఓ క్రిష్టారావు, డాక్టర్ సందీప్, కో ఆప్షన్ సభ్యుడు నాగూర్‌వలి, ఏఓ గోపీ క్రిష్టా, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉలవపాడు: ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని సర్వసభ్యులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో విద్యాశాఖ సమీక్షలో భాగంగా ఉపాధ్యాయుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి చెబుతున్నారు కానీ ప్రభుత్వం అంత ఖర్చు పెడుతున్నా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎంత బోధిస్తున్నారు, వారి విద్య ఎంత మెరుగుపడింది అనే విషయం మాత్రం చెప్పడం లేదన్నారు. ఉపాధ్యాయులు భారీగా జీతాలు తీసుకుంటూ చదువు చెప్పడంలేదన్నారు. కోటిరెడ్డి గుంట గిరిజన కాలనీ విద్యార్థులు కొత్తూరు బడికి వెళుతున్నారని, వారికి 2వ తరగతిలో ఒంట్లు కూడా నేర్పలేదన్నారు. చాగల్లు యూపీ స్కూల్‌లో కూడా ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు బయటకు వెళ్లిపోతున్నారని వైస్ ఎంపీపీ ఫజుల్, సర్పంచ్ లతాచంద్రశేఖర్ ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా ఉండడం లేదని, కార్యక్రమాలు జరిగినపుడు ప్రజాప్రతినిధులు లేకుండా తూతూ మంత్రంగా జరుపుతున్నారని ప్రశ్నించారు. ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రోగుల పట్ల ప్రవర్తించే భాష కూడా దారుణంగా ఉందని గత పాతికేళ్లుగా వైద్యశాలకు ఉన్న మంచి పేరు పోతుందని దీనిని నియంత్రించాలని సర్వసభ్యులు కోరారు. మామిడి సీజన్‌కు సంబంధించి రైతులకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని తెలియచేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లేనివారిపేర్లను పనులకు వచ్చినట్లుగా హాజరు వేస్తున్నారని తెలియచేశారు. మన తీరంలో తమిళనాడుకు చెందిన బోట్లు వచ్చి వేట చేస్తున్నారని దీనిని అరికట్టాలని కోరారు. వరిగ చేనుసంఘంలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని పలుమార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఉలవపాడు సర్పంచ్‌నాగలక్ష్మి అడిగారు. ఉలవపాడు బస్‌స్టేషన్‌ను ఏ ప్రాతిపదికన లీజుకు ఇచ్చారు. బస్‌స్టేషన్ అభివృద్ధి చేస్తారా లేదా, బస్‌స్టేషన్‌ను లేకుండా చేస్తారా తెలియచేయాలని సర్వసభ్యులు ఖాదర్ భాషా, రాధామాధవిలు కోరారు. పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని అధికారులు తెలియచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ, ఎంపీడీఓ చెంచమ్మ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మాధవరావు

పీసీపల్లి: ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతానియమాలు పాటించాలని ఎస్సై కె. మాధవరావు కోరారు. స్థానిక బస్టాండు సెంటర్ ఎస్సై కె.మాధవరావు ఆధ్వర్యంలో బుధవారం వాహనదారులకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించి వేగంగా పోకూడదని సూచించారు. మనపై ఆధారపడ్డవారిని దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలన్నారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఓ శైలజారాణి

కనిగిరి రూరల్: రైతులు అధికారుల సూచనలు సలహాలు పాటించి అధిక దిగుబడిని పొందాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఏ శైలజారాణి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, తుమ్మగుంట రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ, సర్పంచ్‌లు పోతు రమణారెడ్డి, ఇండ్లా చిన ఓబులేసు, సీసీ కే శ్రీనివాసులు, వీఏఏ ఎస్‌కే మహబూబ్ ప్యారీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ



గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్

హనుమంతునిపాడు: మండల పరిధి తిమ్మారెడ్డిపల్లిలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలకుమారి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరు, గర్భిణులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం చిన్నారులు, గర్భిణులకు సక్రమంగా అందించాలన్నారు. సమయపాలన పాటించని అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తప్పవన్నారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందిండం లేదని గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టంగుటూరు: టంగుటూరు 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో అత్యవసర లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నాం 12:30 గంటల వరకు టంగుటూరు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ టౌన్ ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని ఏఈ బుధవారం ఓ ప్రకటనలో కోరారు.

సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న సురక్ష



యాప్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తున్న డాక్టర్ సరస్వతి

జరుగుమల్లి: ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ సరస్వతి పేర్కొన్నారు. మండలంలోని చింతలపాలెం సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష సర్వేను ఆమె పర్యవేక్షించారు. అక్టోబర్ 3వ తేదీన చింతలపాలెం ఎంపీపీ స్కూల్లో వైద్య శిబిరం నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ సరస్వతి పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ రూత్, ఎంపీహెచ్‌ఎమ్ విజయ్ సురేష్, గంగా భవాని, సూపర్‌వైజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోండి



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ

● అధికారులపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ అరుణ ఆగ్రహం

సింగరాయకొండ(టంగుటూరు): మండలంలో అధికారుల పని తీరు బాగోలేదని గత సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలపై ఒక్కదానికి పరిష్కారం చూపలేదని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే సమావేశాలకు తాను హాజరయ్యేది లేదని తేల్చిచెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కట్టా శోబారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ అరుణ మాట్లాడుతూ.. సోమరాజుపల్లి పంచాయతీలోని ఆవులవారిపాలెం, అప్పాపురం, తుఫాన్ బిల్డింగ్ వద్ద ఎస్టీ కాలనీకి సంబంధించి పలు సమస్యలను గత సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చానని, కానీ నేటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రధాన డివైడర్లపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. జల్ జీవన్ మిషన్ పైప్‌లైన్ ఏర్పాటు కోసం పంచాయతీ పరిధిలో రోడ్డును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ధ్వంసం చేశారని, మళ్లీ ఎవరు మరమ్మతులు చేస్తారో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.